
సాక్షి అనకాపల్లి

సోమవారం । 20 । మార్చి । 2023



22న అప్పన్న పెళ్లిరాట

ఈనెల 22న సింహగిరిపై శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామివారి పెళ్లిరాట ఉత్సవాన్ని విశేషంగా నిర్వహించనున్నారు. 8లో



నూకాలమ్మా.. కరుణించమ్మా

బుచ్చెంపేట నూకాలమ్మ తల్లి పండగకు సర్వం సిద్ధం చేశారు. జిల్లేడుపూడి పంచాయతీలో అమ్మవారి ఆలయం కలదు. 8లో



అంధుల వాక్‌థాన్

జీచ్‌రోడ్డు: విద్యాసంవత్సరంలోని ప్రవేశాలపై అవగాహనకు విశాఖలో అంధుల పాఠశాల విద్యార్థులు వాక్‌థాన్ నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఘనంగా మెట్లోత్సవం



మెట్లోత్సవంలో పాల్గొన్న ఎంపీ సత్యవతి దంపతులు

అనకాపల్లి రూరల్: ప్రముఖ వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యుల 520వ వర్ధంతి సందర్భంగా అనకాపల్లి సత్యనారాయణపురం సత్యనారాయణస్వామి దేవస్థానం వద్ద ఆదివారం మెట్లోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ సత్యవతి అన్నమయ్య గొప్పతనాన్ని వివరించారు. అన్నమయ్య 32 వేలకుపైగా కీర్తనలు రచించారని తెలిపారు. ఈ సందర్భంగా అన్నమయ్య విగ్రహానికి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. పలు భజన బృందాల సభ్యులు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. ఆలయ ఆవరణలో సప్తగిరి గోష్టిగానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విష్ణుమూర్తి, బొలిశెట్టి శ్రీనివాసరావు, సకలా గోవిందరావు, లలిత, గణపతి, అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు కాండ్రేగుల అరుణ, కుసుమంచి పద్మావతి, బి కుమారి, తిమాపాత్రుని లక్ష్మి, సావిత్రి, జయలక్ష్మి పాల్గొన్నారు.

నేటి నుంచి ద్వితీయ నాటిక పోటీలు

అనకాపల్లిటౌన్ : ఉభయ తెలుగు రాష్ట్రాల ద్వితీయ నాటిక పోటీలు ఈ నెల 20 నుంచి స్థానిక గవరపాలెం వి.వి.రమణ రైతు భారతి ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ శిలపరశెట్టి బాబి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు జీవీఎంసీ పెద్ద హైస్కూల్ 1975 పూర్వపు విద్యార్థుల ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు(20, 21, 22 తేదీల్లో) జరగుతాయన్నారు. రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఈ నాటికల పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

పీఎంఈజీపీపై సదస్సు రేపు

తుమ్మపాల: అనకాపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 21న ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం(పీఎంఈజీపీ)పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి సహాయ సంచాలకులు వి.పద్మ ఓ ప్రకటనలో తెలిపారు. పరిశ్రమల స్థాపనకు ఆసక్తి గల నిరుద్యోగ యువత సదస్సుకు హాజరై పథకం వివరాలను తెలుసుకోవాలని పేర్కొన్నారు. సదస్సులో జిల్లా పరిశ్రమలు, బ్యాంకులు, ఖాదీ మిషన్ అధికారులు పాల్గొంటారని తెలిపారు. మరిన్ని వివరాలకు 7396749236 అనే ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ

నర్సీపట్నం: ఆస్తి పన్ను బకాయిలపై వడ్డీ మాఫీ చేయనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కె.కనకారావు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం వరకు పన్నుపై విధించిన వడ్డీని పూర్తిగా మాఫీ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్టు చెప్పారు. పన్ను చెల్లింపుదారులు మొత్తం బకాయిని ఈనెల 31లోగా చెల్లిస్తే వడ్డీ మాఫీ వర్తిస్తుందన్నారు. నర్సీపట్నం మున్సిపాలిటీలో రూ.1.10 కోట్ల మేర వడ్డీ మాఫీ అయ్యే అవకాశం ఉందని, పన్ను చెల్లింపుదారుల్లో ప్రధానంగా 24 మందికి రూ.57 లక్షలకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

వన్డేమాతరం

- ఇండియా–ఆస్ట్రేలియా మ్యాచ్‌కు పోటెత్తిన యువత
- టీంఇండియా ఓడినా క్రీడా స్ఫూర్తి చాటుకున్న అభిమానులు



స్టేడియంలో జాతీయ జెండాతో భారత్ జట్టు అభిమానులు

వన్డేమాతరం అంటూ విశాఖ అభిమానులు క్రికెట్‌కు జై కొట్టారు. భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్ అభిమానుల్లో పూనకాలు రప్పించింది. కలిసొచ్చిన మైదానంలో భారత్ బ్యాటర్లు భారీ స్కోరు చేస్తారని ఎదురు చూసిన అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. 117 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా జట్టు వికెట్ కోల్పోకుండా ఓపెనర్లు భారీ షాట్లతో అలరించింది. గెలుపోటములు పక్కన పెడితే విశాఖలో క్రికెట్ గెలిచింది. అభిమానులను ఉత్సాహపరిచింది. వేలాది మంది అభిమానులు ఉప్పొంగేలా చేసింది.



బ్యాటింగ్ చేస్తున్న విరాట్ కోహ్లి



వర్షం తెరిపివ్వడంతో అభిమాని ఆనందం



వికెట్ చేసిన ఆనందంలో ఆస్ట్రేలియన్ క్రికెటర్లు

పెద్దేరు జలాశయంలో పెరుగుతున్న నీటిమట్టం



పెద్దేరు జలాశయం

మాడుగుల రూరల్: పెద్దేరు జలాశయంలో నీటిమట్టం క్రమేపీ పెరుగుతోంది. ఆదివారం నాటికి 135.90 మీటర్లకు పెరిగింది. పూర్తి స్థాయి నీటిమట్టం 137 మీటర్లు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయం పరిసర ప్రాంతంలో 57 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. 40 క్యూసెక్కుల నీరు జలాశయంలోకి వచ్చి చేరినట్టు జలాశయం జేఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఈ నీటిని రాచకట్టు ద్వారా సాగు నీటి అవసరాలు కోసం విడుదల చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

ఆధార్‌లో మార్పులు చేర్పులకు అవకాశం

తుమ్మపాల: ఆధార్‌కార్డులో ఉచితంగా మార్పులు చేర్పులు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని డీఎల్‌డీవో మంజులవాణి తెలిపారు. ఈనెల 15వ తేదీ నుంచి జూన్ 14 వరకు మూడు నెలల పాటు ఎంఆధార్ మొబైల్ యాప్, myaadhaar.uidai.gov.in వెబ్‌సైట్ ద్వారా అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. ఆధార్ కార్డు పొంది 10 సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఒక్కసారి కూడా అప్‌డేట్ చేసుకోని వారి ఆధార్ కార్డును ఈ ఏడాది ఆగస్టుతో రద్దు చేయనున్నట్టు తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకునేందుకు సచివాలయాల్లో కూడా ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు.

40,164 మంది.. రూ.23.89 కోట్లు



చెక్ అందజేసిన సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అజయ్ బాబు, బీసీ సంక్షేమ శాఖ ఏఎస్ డబ్ల్యూ సురేష్

- జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల
- ఉన్నత చదువులకు అండగా ప్రభుత్వం
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎంకి ధన్యవాదాలు తెలిపిన విద్యార్థుల తల్లులు
- లబ్ధిదారులకు చెక్ అందజేసిన సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అజయ్ బాబు

సాక్షి, అనకాపల్లి: ఉన్నత చదువులకు అండగా జగనన్న విద్యాదీవెన నిలుస్తోంది. 2022–23 విద్యాసంవత్సరం అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి జిల్లాలో 40,164 మంది విద్యార్థులకు రూ.23,89,70,179 జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల చేసింది. ఎన్టీఆర్ జిల్లా తిరువూరులో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి ప్రారంభించిన అనంతరం విద్యార్థుల తల్లుల ఖాతాలో సొమ్ము జమఅయింది. ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరం నుంచి అధికారులు, విద్యార్థులు, తల్లులు వీక్షించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం వై.ఎస్ జగన్మోహన్‌రెడ్డికి విద్యార్థుల తల్లులు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అజయ్ బాబు, బీసీ సంక్షేమ శాఖ ఏఎస్‌డబ్ల్యూ సురేష్ విద్యార్థుల తల్లిదండ్రులకు చెక్కు అందజేశారు. జిల్లాలో వెనుకబడిన కులాల సంక్షేమ శాఖలో 36,474 మంది లబ్ధిదారులకు గానూ రూ.21.07 కోట్లు, సాంఘిక సంక్షేమ శాఖలో 2,940 మంది విద్యార్థులకు రూ.2.46 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖ కింద 498 మంది విద్యార్థులకు రూ.20.64 లక్షలు, ముస్లిం మైనారిటీ సంక్షేమం కింద 252 మంది విద్యార్థులకు రూ.15.83 లక్షలు జమ చేశారు.

అత్యధికంగా చోడవరంలో లబ్ధిదారులు..

జిల్లాలో చోడవరం నియోజకవర్గంలో అత్యధికంగా లబ్ధిదారులుండగా అత్యల్పంగా పెందుర్తి నియోజకవర్గంలో ఉన్నారు. అనకాపల్లి నియోజకవర్గంలో 6,077 మంది విద్యార్థులకు రూ.3.90 కోట్లు, చోడవరం నియోజకవర్గంలో 6,651 మంది విద్యార్థులకు రూ.37.42 కోట్లు, మాడుగులలో 5,880 మందికి రూ.3.25 కోట్లు, నర్సీపట్నంలో 6,103 మందికి రూ.3.67 కోట్లు, పాయకరావుపేటలో 5,942 మందికి రూ.3.41 కోట్లు, పెందుర్తిలో 3,253 మందికి రూ.21.27 కోట్లు, యలమంచిలి నియోజకవర్గంలో 6,258 మంది విద్యార్థులకు రూ.37.9 కోట్లు జమ చేశారు.

దంచికొట్టిన వర్షం



కోటవురట్ల మెయిన్‌రోడ్డులో నిలిచిన వర్షంనీరు

- పలు ప్రాంతాల్లో భారీ వర్షం
- మధ్యాహ్నం నుంచి తెరపినిచ్చిన వైనం

సాక్షి, విశాఖపట్నం/తుమ్మపాల/అచ్యుతాపురం(అనకాపల్లి) : ఉమ్మడి విశాఖలో ఆదివారం జోరున వర్షం కురిసింది. అనకాపల్లి జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీగాను, విశాఖ, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొన్నిచోట్ల మోస్తరుగాను వర్షాలు కురిశాయి. వేకువజాము నుంచి ఉదయం పది గంటల వరకు ఆయా ప్రాంతాల్లో ప్రభావం చూపింది. ఉరుములు, మెరుపులతో పాటు పిడుగుల శబ్దాలు వినిపించాయి. అత్యధికంగా అనకాపల్లి జిల్లా గొలుగొండలో 8.9 సెం.మీలు, ఎఎస్సార్ జిల్లా ఎటపాకలో 6.2 సెం.మీలు, విశాఖ జిల్లా పెదగంట్యాడలో 4.3 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైంది. కాగా సోమవారం నుంచి జిల్లాలో వర్షాలు తగ్గుముఖం పట్టనున్నాయి. సోమవారం ఉమ్మడి విశాఖలో తేలికపాటి జల్లులు/వర్షం కురిసే అవకాశం ఉంది. అనకాపల్లి జిల్లాలో ఆదివారం 728 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్టు సీపీవో జి.రామారావు తెలిపారు. జిల్లాలో అన్ని మండలాల్లోను సగటున 30.33 శాతం మిల్లీమీటర్ల వర్షం కురిసినట్టు చెప్పారు.

నీట మునిగిన పంటలు : అనకాపల్లి ఆవఖండం ప్రాంతంలో టమాటా, మిరప, నువ్వులు తదితర పంటలు నీట మునిగాయి. దాదాపు వంద ఎకరాల వరకు టమాటా మునిగినట్టు అంచనా. నీటమునిగిన టమాటా పంటకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. అచ్యుతాపురం మండలంలోని మోసయ్యపేటలో శనివారం రాత్రి పడిన పిడుగులకు పంచదార్ల రాములమ్మకు చెందిన రెండు పాడి గేదెలు మృతి చెందాయి. దీంతో రూ. లక్ష నష్టం కలిగింది. జిల్లాలో వరి, నువ్వులు, అపరాలపై కొద్దిగా ప్రభావం ఉన్నా చాలా వరకూ పంటల్ని కోయడం వల్ల నష్టం తగ్గిందని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు తెలిపారు. ద్రోణి తీవ్రత తగ్గిన తర్వాత నష్టంపై అంచనా వేస్తామని చెప్పారు.

అనకాపల్లి జిల్లాలో మండలాల వారీగా వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో..)

గొలుగొండ 89.4, యలమంచిలి 44.8, అచ్యుతాపురం 44.2, నర్సీపట్నం 40.2,అనకాపల్లి 38.2,కశింకోట 38.0,పాయకరావుపేట 37.2,మునగపాక 35.0, పరవాడ 34.2, నక్కపల్లి 28.6, మాకవరపాలెం 28.4, రాంబిల్లి 28.4, సబ్బవరం 26.8, ఎస్.రాయవరం 25.8, మాడుగుల 25.6,బుచ్చెయ్యపేట 24.8, కోటవురట్ల 23.0, రోలుగుంట 20.6, నాతవరం 20.2 చీడికాడ 19.4 చోడవరం 18.4 రావికమతం 15.6 కె.కోటపాడు 13.0 దేవరాపల్లి 8.2.



అనకాపల్లి ఆవఖండంలో నీటమునిగిన టమాట పంట

జాతీయ స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ముగ్గురి ఎంపిక



పోటీలకు ఎంపికయిన విద్యార్థినులు

అచ్యుతాపురం(అనకాపల్లి): జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు నునపర్తిలో శ్రీరామా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు మహారాష్ట్రలో నిర్వహించనున్న అండర్–19 జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో వీరు పాల్గొనున్నారు. ఈ నెల 17,18,19 తేదీల్లో నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విశాఖ జిల్లా తరఫున పాల్గొని ప్రతిభ కనబరిచిన రాధా, స్రవంతి, హిమబిందులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవడంతో పాటు, స్టార్ ఆఫ్ ది ఆంధ్ర బెస్ట్ ప్లేయర్ అవార్డు లు దక్కించుకున్నారు. వారిని బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహనాయుడు, గౌరవ అధ్యక్షుడు శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శి అప్పారావు అభినందించారు.

కొత్త అమావాస్య జాతరకు సర్వం సన్నద్ధం

- జూన్లో అమ్మవారి గుడి చుట్టూ రూ.11 కోట్లతో రాతి నిర్మాణం
- నేడు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి గుడివాడ
- మీడియాతో నూకాంబిక ఆలయ ఈవో చంద్రశేఖర్

అనకాపల్లిటౌన్ : కొత్త అమావాస్య జాతరను పురస్కరించుకుని నూకాంబిక అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ఈవో డి.చంద్రశేఖర్ తెలిపారు. గవరపాలెంలోని అమ్మవారి ఆలయ సమీపంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలయం చుట్టూ రూ.11 కోట్లతో నిర్మించనున్న రాతి కట్టడం పనులు జూన్ 1న ప్రారంభించనున్నట్టు తెలిపారు. రూ.7 కోట్ల నిధులు ప్రభుత్వం విడుదల చేయగా, టీటీడీ నుంచి రూ.3 కోట్ల నిధులకు టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి ఆమోదం తెలిపినట్టు వెల్లడించారు. సోమవారం సాయంత్రం 6 గంటలకు నూకాంబిక అమ్మవారికి రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దంపతులు పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే వీవీఐపీ భక్తుల దర్శనాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అమ్మవారి ఆలయం ఎదురుగా తూర్పు దిక్కున 9 అంతస్తుల ఎత్తులో రాజగోపురం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 80, 81వ వార్డుల కార్పొరేటర్ల చొరవతో రూ.40 లక్షల నిధులు వెచ్చించి కొత్తగా మరుగుదొడ్లు నిర్మించనున్నట్టు వెల్లడించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జీవీఎంసీ వారిచే రెండు మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేశామన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల రహదారులపై సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, నిత్యం పోలీస్ పర్యవేక్షణ ఉంటుందన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ఈవో చంద్రశేఖర్

వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు దాడి జయవీర్ మాట్లాడుతూ ఏప్రిల్ 19 వరకు నెల రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల భక్తులతో పాటు, పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరై, జాతరలో పాల్గొంటారని పేర్కొన్నారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జాతర రోజు రాత్రికి వచ్చే భక్తులకు అన్నసమారాధన, ఇతర సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జీవీఎంసీ ప్రజారోగ్య సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ప్రతి మూడు గంటలకు శానిటైజేషన్ చేయనున్నట్టు వెల్లడించారు.

మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా అమ్మవారి పండగను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ఆరు మాసాల క్రితం అసోం రాష్ట్రంలో నూకాంబిక అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి నూతనంగా గుడిని నిర్మించినట్టు పేర్కొన్నారు. మెయిన్‌రోడ్డులో యూనియన్ బ్యాంక్ సహకారంతో ఏటీఎం కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. గర్భిణులు, బాలింతలు అమ్మవారి దర్శనానికి ఇబ్బంది పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.

క్లుప్తంగా

26న చాగంటి వారి భాగవత ప్రవచనం

అనకాపల్లిటౌన్ : వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 26న స్థానిక రావుగోపాలరావు కళాక్షేత్రంలో బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుచే భాగవత ప్రవచనం ఏర్పాటు చేసినట్టు ట్రస్ట్ వ్యవస్థాపకుడు కాండ్రేగుల విష్ణుమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో 'భాగవత కథా శ్రవణం.. మానవజన్మ సార్థకతకు సోపానం'అనే అంశంపై ఆయన ప్రవచిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు.

విద్యార్థులు ఆంగ్లంపై పట్టుసాధించేలా కృషి


శిక్షణ కేంద్రంలోని ప్రొఫెసర్ నుంచి సర్టిఫికెట్ అందుకుంటున్న నాగజ్యోతి

రావికమతం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టు సాధించేలా వారికి మరిన్ని మెలకువలు అందించేందుకు కృషి చేస్తానని కన్నంపేట పాఠశాల హెచ్ఎం పి.వి.ఎం. నాగజ్యోతి తెలిపారు. దక్షిణ భారత దేశంలోని ప్రతిష్టాత్మకమైన రీజినల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష(ఆర్ఐఈ) సంస్థ బెంగళూరులో నెల రోజుల పాటు సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఇంగ్లిషు లాంగ్వేజ్ టీచింగ్(సీఈఎల్టీ)పై శిక్షణ ఇచ్చింది. పలు రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన ఉపాధ్యాయులను ఈ శిక్షణకు పంపారు. రావికమతం మండలానికి చెందిన నాగజ్యోతి ఈ శిక్షణలో పాల్గొని, 98 శాతంతో మెరిట్ సాధించి అక్కడి పొఫెసర్ల అభిమానాన్ని చూరగొన్నారు. కోర్స్ డైరెక్టర్ డాక్టర్ సుమంగళ,కోఆర్డినేటర్స్ రవి నారాయణ,ఉజ్మల తదితరుల చేతుల మీదుగా సర్టిఫికెట్ అందుకున్నారు.ఆదివారం ఇక్కడికి వచ్చిన ఆమె విలేకరులతో మాట్లాడుతూ అక్కడి ఇచ్చిన శిక్షణ గురించి వివరించారు. విద్యార్థులకు ఇంగ్లిష్ మరింత సులభంగా అర్థమయ్యేలా బోధిస్తానని చెప్పారు.

ఆగిన వర్షం.. అభిమానుల ఉత్సాహం


క్రికెట్ అభిమాని కేరింతలు


కిక్కిరిసిన స్టేడియం
క్రికెట్ అభిమాని కేరింతలు

సాక్షి, విశాఖపట్నం/విశాఖ స్పోర్ట్స్: క్రికెట్ మ్యాచ్ అంటే ఎప్పుడో ఓ సారి వచ్చే పండగ. అలాంటి పండగ వచ్చిందంటే ఎలాంటి అవాంతరాలు రాకుండా మ్యాచ్‌ను ప్రత్యక్షంగా వీక్షించాలని ఆకాంక్షిస్తారు. సాధారణంగా ఈ మ్యాచ్‌లకు వరుణుడే ఆటంకాలు కల్పిస్తుంటాడు. అందుకే మ్యాచ్ జరిగే రోజు ఆయన కరుణించాలని కోరుకుంటారు. కానీ భారత్–ఆస్ట్రేలియా క్రికెట్ మ్యాచ్‌కు రెండురోజుల ముందు నుంచే వరుణుడు భయపెట్టాడు. శనివారం ఉదయం నుంచే చిరుజల్లులతో బెదిరించాడు. ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులు, కుండపోత వర్షంతో మరింత వణికించాడు. దీంతో అంతా క్రికెట్ మ్యాచ్‌పై ఆశలు వదులుకున్నారు. ఈ మ్యాచ్ ఇక వర్షార్పణమే అనుకున్నారు. వర్షం తగ్గుముఖం పట్టి క్రికెట్ మ్యాచ్‌కు ఆటంకం లేకుండా చూడాలని కోరుకున్నారు. వారి విన్నపాన్ని వరుణుడు కరుణించాడు. మధ్యాహ్నం 11 గంటలకు సూర్యుడు ఎండతో ప్రత్యక్షమయ్యాడు. ఫలితంగా ఒక్కసారిగా క్రికెట్ ప్రియుల ముఖాలు విప్పారాయి. ఇక ఆ తర్వాత వర్షపు ఛాయలే కానరాలేదు. మేఘాలు కమ్ముకున్నా వర్షించలేదు. దీంతో పీఎంపాలెంలోని వైఎస్ రాజశేఖరరెడ్డి ఏసీఏ స్టేడియంలో జరిగే మ్యాచ్‌ను వీక్షించడానికి క్రికెట్ అభిమానులు తరలివచ్చారు. ఈ మ్యాచ్‌లో భారత్ ఓటమి చెందినా.. అభిమానులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి ఆటను ఆస్వాదించారు.

భారత్–ఆస్ట్రేలియా జట్ల మధ్య జరిగిన రెండో వన్డేకు విశాఖతో పాటు శ్రీకాకుళం, ఒడిశా, జార్ఖండ్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు తరలివచ్చారు. క్రికెట్ అభిమానులతో ఆదివారం మధ్యాహ్నం నుంచే స్టేడియం కిక్కిరిసిపోయింది. ఇండియా గెలవాలంటూ అభిమానులు చేతిలో భారత్ జెండాలు పట్టుకుని.. ముఖాన మువ్వెన్నెల జెండా రంగులు అద్దుకొని నినదించారు. భారత్ టీ షర్టులు ధరించి స్టేడియం వద్దకు వచ్చి కేరింతలు కొట్టారు. అయితే అచ్చొచ్చిన స్టేడియంలో భారత్ బోల్తా కొట్టడంతో అభిమానులు ఒకింత నిరుత్సాహానికి గురయ్యారు. అడపాదడపా అభిమానులు కేరింతలు మినహా స్టేడియంలో ఎక్కువగా నిశ్శబ్దమే ఆవహించింది. ఇక మ్యాచ్ మొదలై.. పూర్తయినప్పటికీ స్టేడియం చుట్టూ భారీ సంఖ్యలోనే జనం గుమిగూడి కనిపించారు. ఇటు హనుమంతవాక నుంచి అటు మారికవలస వరకు రోడ్లన్నీ వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం లేకుండా రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ సిబ్బందికి సూచనలిస్తూ.. ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించారు. అభిమానుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపింది. ఇక బ్లాక్ టికెట్లను బహిరంగంగానే విక్రయించారు. విశాఖ జిల్లా తరఫున ఆడుతున్న అండర్–14, 16 జట్ల ఆటగాళ్లను ఏసీఏ ఉపాధ్యక్షుడు రోహిత్‌రెడ్డి అభినందించారు. ఆంధ్రా తరఫున ప్రాతినిధ్యం వహించేస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. వీరంతా ఈ మ్యాచ్‌కు బాల్ బాయిస్‌గా సేవలందించారు.

బోల్తాకొట్టిన భారత్

టాస్ ఓడిపోయి బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ 37 ఓవర్లలో కేవలం 117 పరుగులకే ఆలౌటైంది. కోహ్లి 31, జడేజా 16 పరుగులు చేయగా అక్షర్ 29 పరుగులతో నిలవడంతో భారత్ ఆ మాత్రం స్కోర్ చేయగలిగింది. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన ఆస్ట్రేలియా కేవలం 11 ఓవర్లలోనే వికెట్ పడకుండానే విజయం సాధించింది. విశాఖ పిచ్‌పై ఇంత భారీ తేడాతో భారత్ ఓడిపోవడం ఇదే తొలిసారి.

సందడి చేసిన హీరో నాని

విశాఖ స్పోర్ట్స్: భారత్–ఆసీస్ వన్డే మ్యాచ్‌లో భాగంగా స్టేడియంలో సినీ హీరో నాని సందడి చేశారు. తన సినిమా దసరా ప్రమోషన్‌లో భాగంగా కామెంటేటర్లు సునీల్ గావస్కర్, ఎంఎస్‌కే ప్రసాద్‌తో కాసేపు ముచ్చటించారు. సచిన్ ఆట అంటే తనకు ఇష్టమన్నారు. తను నటించిన పలు సినిమాల పేర్లను క్రికెట్లకు ఇస్తూ స్టేడియం నార్త్‌బ్లాక్‌లో సందడి చేశారు. రోహిత్ జెంటిల్‌మెన్, హార్దిక్ పాండ్య పిల్ల జమిందార్, కోహ్లి గ్యాంగ్‌లీడర్ అంటూ టైటిల్ ఇచ్చారు. ఆసీస్ మాజీ క్రికెటర్ ఆరోన్ ఫించ్‌కు దసరాలోని ధూమ్‌ధామ్ సిగ్నేచర్ స్టెప్ నేర్పించి.. ఇద్దరూ కలిసి సరదాగా ఆ స్టెప్ వేశారు.


ఇండియా టీమ్‌కి స్వాగతం పలుకుతున్న సచిన్ వీరాభిమాని సుధీర్ కుమార్


బాంబు స్క్వాడ్ తనిఖీలు


మ్యాచ్ తిలకించేందుకు వచ్చిన ఆస్ట్రేలియన్లు




మ్యాచ్‌కు తరలివస్తున్న క్రికెట్ అభిమానులు




22న అప్పన్న పెళ్లిరాట



సింహాచలం : ఉగాదిని పురస్కరించుకుని ఈనెల 22న సింహగిరిపై శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామివారి పెళ్లిరాట ఉత్సవాన్ని విశేషంగా నిర్వహిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆదివారం తెలిపారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సరం ప్రారంభాన్ని పురస్కరించుకుని ఆరోజు సాయంత్రం ఆలయ ఆస్థాన మండపంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తామన్నారు. అనంతరం స్వామివారి పెళ్లిరాట ఉత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. తదుపరి పండితులకు సత్కారాలు, దాతలకు విశిష్ట సేవ పురస్కారాలు ఉంటాయన్నారు. అనంతరం స్వామికి తిరువీధి నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4గంటలకు స్వామివారి మూలవిరాట్‌పై సూర్యకిరణాలు పడే అవకాశం ఉంటుందన్నారు. భక్తులంతా ఈకార్యక్రమాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు.

హడలెత్తించిన పిచ్చికుక్క హతం


గ్రామస్తుల చేతిలో హతమైన పిచ్చికుక్క

బుచ్చెయ్యపేట : నాలుగు గ్రామాల్లో ప్రజలకు ఐదు రోజులుగా నిద్ర లేకుండా చేసి పలువురిని గాయపరిచిన పిచ్చికుక్క ఎట్టకేలకు హతమైంది. బుచ్చెయ్యపేట, దిబ్బిడి, ఐయితంపూడి, నేతవానిపాలెం గ్రామాల్లో పిచ్చికుక్క వీరవిహారం చేసింది. ఎదుట పడిన వారిని ఇంటి దగ్గరవున్న 30 మందిని గాయపరచడమే కాక పలువురు రైతుల పాడి పశువులు, కోళ్లు, గొర్రెలను కరిచి తీవ్రంగా గాయపరిచింది. గాయాలతో వచ్చిన పలువురిని బుచ్చెయ్యపేట వైద్య సిబ్బంది మెరుగైన వైద్య సేవల కోసం అనకాపల్లి, చోడవరం ఏరియా ఆసుపత్రులకు తరలించారు. పిచ్చికుక్క భయంతో నాలుగు గ్రామాల్లో ప్రజలు చిన్న పిల్లలు, వృద్ధులు బయట తిరగడానికి భయపడి ఇళ్లల్లోనే ఉండిపోయేవారు. దీంతో ఆయా గ్రామస్తులు మూడు రోజులుగా పిచ్చికుక్కను చంపడానికి ప్రయత్నించారు. ఐయితంపూడిలో శనివారం అర్ధరాత్రి మాటు వేసి గ్రామంలోకి వచ్చిన పిచ్చికుక్కను కర్రలతో కొట్టి చంపి పాతి పెట్టారు.

'మీ ఖాతా నుంచి నగదు విత్ డ్రా అయింది...'

బుచ్చెయ్యపేట : బ్యాంక్ ఖాతా నుంచి తమకు తెలియకుండానే డబ్బులు విత్ డ్రా అవుతుండడంపై పలువురు ఆందోళన చెందుతున్నారు. బుచ్చెయ్యపేట మండలం బంగారుమెట్టకు చెందిన కొట్యాడ మంగపతి బ్యాంక్ ఖాతా నుంచి రూ.14 వేలు, కడియం శ్రీను బ్యాంక్ ఖాతా నుంచి రూ.2,200 నగదు విత్ డ్రా చేసినట్టు రెండు రోజుల కిందట ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో శనివారం వీరు బ్యాంక్‌కు వెళ్లి వివరాలు అడగ్గా ఆధార్ కార్డు వేలిముద్ర ద్వారా నగదు విత్ డ్రా చేసినట్టు బ్యాంక్ సిబ్బంది తెలపడంతో వీరు ఖంగుతిన్నారు. తాము ఎక్కడా నగదు విత్ డ్రా చేయలేదని బాధితులు వాపోతున్నారు. అలాగే వడ్డాదికి చెందిన మెకానిక్ సుబ్రమణ్యం బ్యాంక్ ఖాతా నుంచి రూ.4వేలు నగదు విత్ డ్రా చేసినట్టు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. వీరితో పాటు మరికొంత మందికి బ్యాంక్ నుంచి నగదు విత్ డ్రా చేయకుండానే నగదు విత్ డ్రా చేస్తున్నట్టు ఫోన్ మెసేజ్‌లు రావడంపై ఆందోళన చెందుతున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధితులు తెలిపారు.

హీటర్ ఆన్ చేసి..మర్చిపోవడంతో...


కాలిపోయిన గృహోపకరణాలు

రావికమతం: గుమ్మాళ్లపాడు గ్రామానికి చెందిన గొర్లె సత్తిబాబు ఇంటిలో విద్యుత్ ప్రమాదం జరిగి గృహోపకరణాలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో ఆయనకు రూ.20వేల ఆస్తి నష్టం జరిగినట్టు అంచనా. వివరాలివి. వేడి నీళ్ల మరిగించేందుకు ఎలక్ట్రిక్ హీటర్ వేశారు. ఆపై కరెంట్ పోవడంతో నీళ్ల తీసేసి హీటర్‌ను అలాగే మర్చిపోయి పొలానికి వెళ్లిపోయారు. కరెంట్ వచ్చాక హీటర్ నిప్పుల కొలిమిలా మండి టేబుల్ గ్రైండర్,కిచెన్‌లోని ఇతర గృహోపకరణాలు కాలిపోయాయి. ఇళ్లంతా పొగలు వాపించడంతో స్థానికుల సమాచారం మేరకు సత్తిబాబు ఇంటికి వచ్చి మరికొన్ని సమాగ్రిని రక్షించుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


చెట్టుకు వేలాడుతున్న సింహాచలం నాయుడు మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ తాతారావు

దేవరాపల్లి : మండల కేంద్రం దేవరాపల్లి గాంధీ వీధికి చెందిన జామి సింహాచలం నాయుడు (28) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దేవరాపల్లికి సమీపంలోని శారదానది ఒడ్డున రావి చెట్టు కొమ్మకు ఉరి వేసుకొని వేలాడుతున్న అతని మృతదేహాన్ని ఆదివారం తెల్లవారు జామున స్థానికులు గుర్తించారు. దీంతో స్థానికులు ఒక్కసారిగా తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే అతని కుటుంబీకులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక సీఐ ఎస్. తాతారావు, ఇంచార్జ్ ఎస్ఐ రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. చెట్టుకు వేలాడి ఉన్న సింహాచలంనాయుడు మృతదేహాన్ని చూసి తల్లి సింహాచలమ్మ ఇతర కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడి కాలు నేలకు తాకి ఉండడంతో కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారు. మృతుడి తల్లి సింహాచలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తాతారావు, ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. అవివాహితుడైన సింహాచలం నాయుడు సొంత ట్రాక్టర్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. మృతుడి తండ్రి ఇది వరకే మరణించగా, తల్లి సింహాచలమ్మ, వివాహితురాలైన అక్క, అవివాహితుడైన తమ్ముడు ఉన్నారు. ఇంటికి పెద్ద దిక్కుగా నిలిచిన కుమారుడు అనుమానస్పద స్థితిలో మృతిచెందడంతో తల్లి, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలపై హర్షం

మురళీనగర్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు కాంట్రాక్ట్ పద్దతిలో ఉద్యోగాలు ఇవ్వడంపై వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ విశాఖ జిల్లా అధ్యక్షుడు చిరికి శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 4,534 మంది క్వాలిఫైడ్ అభ్యర్థులు కాంట్రాక్ట్ పద్ధతిలో ఉద్యోగాలు పొందుతారని చెప్పారు. ఈ నెలాఖరులోపు అభ్యర్థులందరికీ నియామకపు పత్రాలు వస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం 4,534 మంది కుటుంబాల్లో వెలుగులు నింపిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు.


భావోద్వేగాలే 'దసరా'


మాట్లాడుతున్న హీరో నాని

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): పాత్రల మధ్య ఘర్షణ, భావోద్వేగాలే దసరా కథ అని ఆ చిత్ర హీరో నాని చెప్పారు. దసరా కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రమన్నారు. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఆయన ఆదివారం సాయంత్రం నోవటెల్ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. దసరా సినిమా ఈనెల 30వ తేదీన ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతోందని తెలిపారు. పుష్ప, కేజీఎఫ్–2 చిత్రం మాదిరిగానే దసరా చిత్రం గురించి ప్రేక్షకులు మాట్లాడుకుంటారన్నారు. బలమైన కథ, కథనం మరో లెవెల్‌లో ఉంటుందని నాని చెప్పారు. దర్శకుడు శ్రీకాంత్ ఓదెల సినిమా బాగా తీశాడన్నారు. పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు.

నూకాలమ్మా..కరుణించమ్మా

- బుచ్చెంపేటలో కొత్త అమావాస్య పండగకు ప్రత్యేక ఏర్పాట్లు
- నేటి నుంచి హోమాలు ప్రత్యేక పూజలు
- ఉమ్మడి విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు రాక


నూకాలమ్మ తల్లి


అమ్మవారి ఎడమ భాగంలో ఏనుగు తొండంలో కనిపించేలా నిర్మించిన వినాయక ఆలయం

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి బుచ్చెంపేట నూకాలమ్మ తల్లి పండగకు సర్వం సిద్ధం చేశారు. మండలంలోని జిల్లేడుపూడి పంచాయతీలో అమ్మవారి ఆలయం కలదు. ఏటా కొత్త అమావాస్యకు ఈ పండగను ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఏ పనీ తలపెట్టిన ముందుగా అమ్మవారిని దర్శించుకుని ప్రారంభిస్తే అవలీలుగా పూర్తవుతుందన్న అపారమైన నమ్మకం ఉంది. దాంతో స్థానికులతోపాటు ఉమ్మడి విశాఖపట్నం తూర్పుగోదావరి జిల్లాల ప్రజలు ఆరాధ్య దైవంగా పూజిస్తుంటారు. సోమవారం నుంచి ఆలయ ప్రాంగణంలో హోమాలు, ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాటు చేశారు. ఆలయ ప్రాంగణంలో ఇనుప గ్రిల్ క్యూలైను, ప్రత్యేకంగా తాగునీరు, ప్రసాదం అందించేందుకు షామియానాలు ఏర్పాటు చేశారు.

ఆలయ చరిత్ర ఇదీ!

ఇక్కడ నూకాలమ్మ తల్లి అమ్మవారు మొదట్లో అడవి ప్రాంతాన్ని తలపించే తోటల మధ్య మర్రిచెట్టు నీడలో కమ్మపాకలో ఉండేవారు. రాతి విగ్రహాలను అమ్మవారిగా స్థానికులు పూజించేవారు. ఈ నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి వైజాగ్ స్టీల్ ప్లాంటుకు నీటిని తరలించేందుకు ఏర్పాటు చేస్తున్న ఏలేరు కాలువ పనుల్లో జిల్లేడుపూడిలో ఆటంకాలు ఏర్పడ్డాయి. ఎత్తయిన ప్రాంతం కావడంతో కాలువ తవ్వడానికి కుదరలేదు. దాంతో సొరంగం తీయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. అప్పట్లో దివంగత నేత ఎం. ప్రభాకర్ చౌదరి ముందుకు వచ్చాడు. ఆ సమయంలో ఒక వృద్ధుడు కనిపించి ముందుగా అమ్మవారిని దర్శించుకోవాలని సలహా ఇచ్చాడు. ఆ మాట ప్రకారం మరుసటిరోజు మర్రిచెట్టు పొదలో శిథిలమైన ఉన్న అమ్మవారి రాతి విగ్రహాన్ని దర్శించుకున్నాడు. కాలువ పనులు దిగ్విజయంగా పూర్తయితే ఆలయం నిర్మిస్తానని మొక్కుకున్నారు. ఆ ప్రకారం 1988లో సొంత నిధులతో సర్వాంగ సుందరంగా అమ్మవారి ఆలయం నిర్మించాడు. అమ్మవారికి కుడి వైపు 30 అడుగులు ఎత్తులో నాగసర్పంతో కూడిన శివలింగం, ఎడమ వైపు ఏనుగు తొండంలో కనిపించే విధంగా వినాయకుడి ఆలయం నిర్మించాడు. ఆంజనేయ స్వామి, మహలక్ష్మి అమ్మవారుతోపాటు పలు దేవుళ్ల విగ్రహాలు నవగ్రహాలు ఏర్పాటు చేశాడు. అప్పట్నుంచి ఉగాదికి భారీ స్థాయిలో జిల్లేడుపూడి గ్రామస్తులు అమ్మవారి పండగ చేస్తున్నారు.

క్లుప్తంగా

భూసర్వే పకడ్బందీగా చేపట్టాలి



డీటీ, ఆర్ఐలతో మాట్లాడుతున్న చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆదివారం తన కార్యాలయంలో డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బందితో సమావేశమయ్యారు. సమగ్ర భూసర్వే త్వరితగతిన పూర్తి చేసి మంచిపేరు తీసుకురావాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని, తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటి వరకు జరిగిన సర్వేపై రెవెన్యూ సిబ్బందిని ఆరా తీశారు. కార్యక్రమంలో డీటీలు, ఆర్ఐలు, రెవెన్యూ సర్వేయర్లు పాల్గొన్నారు.

మల్లు స్వరాజ్యంకు ఘన నివాళి



మల్లు స్వరాజ్యం చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కశింకోట : కశింకోటలో సాయుధ పోరాట యోధురాలు మల్లు స్వరాజ్యం వర్థంతి కార్యక్రమాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికను దర్శించుకున్న దాడి



జాతర ఏర్పాట్లపై ఆలయ ఈవోతో మాట్లాడుతున్న దాడి వీరభద్రరావు

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి గవరపాలెం నూకాంబిక అమ్మవారిని ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ఈవో డి.చంద్రశేఖర్‌తో మాట్లాడి, సోమవారం జరగనున్న జాతర ఏర్పాట్లపై చర్చించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
ఫలానా అబ్బాయి	
ఫలానా అమ్మాయి	సత్యనారాయణస్క్రీన్-1
మనసిస్తావా	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
షజామ్	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
జంతు ప్రపంచం	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 31 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-15 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-9 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 294 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 205 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

అభివృద్ధికి దూరంగా.. కశింకోట రైల్వే స్టేషన్

- 60 ఏళ్ల చరిత్ర.. అయినా స్టేషన్ స్థితి దైన్యం
- గతంలో 8 రైళ్లు ఆగేవి.. ఇపుడు నాలుగే..
- చెంతనే స్టేషన్ ఉన్నా.. అనకాపల్లి వెళ్లాల్సిందే!



చెత్తా చెదారం, తుప్పలతో నిండి ఉన్న రైల్వే స్టేషన్ ప్రాంగణం



కశింకోట రైల్వే స్టేషన్

కశింకోట : మండల కేంద్రంలో ఉన్న రైల్వే స్టేషన్ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. దీంతో ప్రయాణికులకు ఇక్కట్లు తప్పట్లేదు. ఈ స్టేషన్ సుమారు 60 ఏళ్ల క్రితం ఏర్పడింది. కశింకోట, వెదురుపర్తి, సంపతిపురం, పిసినికాడ తదితర ప్రాంతాలకు ఈ స్టేషనే పెద్ద దిక్కు. విశాఖలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు, కూరగాయల వ్యాపారులు, ప్రయాణికులకు ఈ స్టేషనే ప్రధాన కేంద్రం. ఇక్కడి నుంచే యలమంచిలి, తుని, అన్నవరం, రాజమండ్రి, తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు.

సదుపాయాలు నిల్

స్టేషన్లో సరైన సదుపాయాలు లేవు. ప్లాట్‌ఫారాలు ఎత్తు చాలా తక్కువ. దీంతో రైలు ఎక్కి, దిగడానికి ప్రయాణికులు ఇక్కట్లకు గురవుతున్నారు. రైలు ఎక్కేటపుడు.. దిగేటపుడు ఏ మాత్రం ఏమరుపాటుగా కిందపడిపోవడం ఖాయం. ప్రధానంగా వృద్ధులు, పిల్లలు, మహిళలు చాలా ఇబ్బంది పడుతున్నారు. దీంతో కొందరు అనకాపల్లి వెళ్లి రైలు ఎక్కాల్సిన పరిస్థితి. ఒకవైపు స్టేషన్ ఆవరణలో తుప్పలు పెరిగి, చెత్త పేరుకుపోయి అధ్వానంగా ఉంది. విష సర్పాలు, పురుగులు చేరడంతో ప్రయాణికులు ఆందోళనపడుతున్నారు. వీటిని తొలగించి శుభ్రపరచాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రైవేటీకరణతో ఇక్కట్లు

స్టేషన్ గతంలో రైల్వే శాఖ సిబ్బందితో నడిచేది. దాన్ని ప్రైవేటీకరించి టిక్కెట్ల విక్రయాన్ని కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఈ నేపథ్యంలో స్టేషన్ ఆలనా పాలనా సరిగా చూసే నాథుడు లేక అభివృద్ధికి దూరంగా ఉంది. అనకాపల్లి జిల్లా కేంద్రానికి అతి చేరువలో ఉన్న స్టేషన్ అన్ని విధాలా అభివృద్ధి చేసి సదుపాయాలు మెరుగుపర్చడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆగే రైళ్లు నాలుగే!

కశింకోట స్టేషన్‌లో రానూ పోనూ నాలుగు రైళ్లే నిలుస్తున్నాయి. కాకినాడ-విశాఖ, రాజమండ్రి-విశాఖల మధ్య రానూ పోనూ నడిచే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. ఇవి గతంలో పాసింజర్లుగా నడిచేవి. వాటినే ప్రత్యేక ఎక్స్‌ప్రెస్‌లు చేసి తాజాగా నడుపుతున్నారు. దీంతో కశింకోట-విశాఖ మధ్య రూ.15 ఉండే టిక్కెట్ ధర కూడా రెట్టింపు అయింది. అయితే ఇవి సకాలంలో రాకపోవడం వల్ల ఉద్యోగ విధులకు, విద్యా సంస్థలకు, గమ్యాలకు సకాలంలో చేరలేకపోతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. కరోనాకు ముందు 8 రైళ్లు ఆగేవి. ఇప్పుడు అవి సగానికి పరిమితమయ్యాయి.

ఆ రెండు రైళ్లను నిలపాలి

గతంలో పాసింజర్లుగా నడిపే రాయగడ-విజయవాడ, విశాఖ-విజయవాడల మధ్య నడిచే రైళ్లను ఎక్స్‌ప్రెస్ సర్వీసులుగా మార్చారు. వాటిని ఇప్పుడు కశింకోటలో నిలపట్లేదు. ఇక్కడి నుంచి విజయవాడ, రాయగడ, విజయనగరం, బొబ్బిలి తదితర ప్రాంతాలకు రాయగడ పాసింజర్ రైలుపై గతంలో ఎక్కువ మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేవారు. ఈ రైలు విశాఖ రాకపోకలకు చాలా అనువుగా ఉండేది. దీంతో ఈ రైళ్లపై ఆధారపడే వారు అనకాపల్లి వెళ్లాల్సి వస్తోంది. అక్కడి నుంచి కశింకోట రాకపోకలకు బస్సు చార్జీలు అదనం. ఎక్స్‌ప్రెస్‌లుగా నడుపుతున్న రాయగడ-గుంటూరు, విశాఖ-మచిలీపట్నం రైళ్లను కశింకోట స్టేషన్లో నిలిపేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



కశింకోట రైల్వే స్టేషన్‌లో దిగువకు ఉన్న ప్లాట్ ఫారాలు

అనుకూల సమయాల్లో రైళ్లు లేవు



కశింకోట రైల్వే స్టేషన్‌లో రానూ పోనూ నాలుగు రైళ్లే ఆగుతున్నాయి. అవి కూడా అనుకూల సమయానికి రాక, సకాలంలో విధులకు చేరలేకపోతున్నాం. దీంతో వ్యయప్రయాసలకోర్చి అనకాపల్లి వెళ్లాల్సి వస్తోంది. అక్కడే దిగి ఇబ్బంది పడుతూ కశింకోట వస్తున్నాం. దీని దృష్ట్యా గుంటూరు-రాయగడ, విశాఖ-మచిలీపట్నం మధ్య నడిచే రైళ్లను ఇక్కడ నిలిపితే ప్రయాణానికి అనుకూలంగా ఉంటుంది.

– రాయి శ్రీనివాసరావు, ప్రయాణికుడు, కశింకోట

స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి



కశింకోట రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేయాలి. ప్లాట్‌ఫారాలు ఎత్తు లేకపోవడం వల్ల రైలు ఎక్కి దిగడానికి తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోంది. ఒక్కొక్కసారి కొందరు ప్రయాణికులు కింద పడిపోయి గాయాల పాలవుతున్నారు. స్టేషన్‌లో తుప్పలు, చెత్త తొలగించి శుభ్రపరచాలి. అనకాపల్లికి చేరువగా ఉన్న కశింకోట స్టేషన్‌ను అన్ని సదుపాయాలతో అభివృద్ధి చేయాలి.

–షేక్ రజాక్, ప్రయాణికుడు, కశింకోట

రెండు వేల మందికి వాయనాలు



ముత్తయిదువులకు వాయనాలు ఇస్తున్న మళ్ల జగప్పారావు మోహిని దంపతులు

అనకాపల్లిటౌన్ : గవరపాలెం నూకాంబిక కొత్త అమావాస్య జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం రెండు వేల మంది ముత్తయిదువులకు వాయనాలుగా జాకెట్, గాజులు, పసుపు, కుంకుమ అందించారు. అమ్మవారి మాలధారుల సేవా సంఘం వ్యవస్థాపకులు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో వ్యాపారవేత్త మళ్ల జగప్పారావు, మోహిని దంపతుల ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మళ్ల జగప్పారావు మాట్లాడుతూ ఏటా కొత్త అమావాస్య జాతర మహోత్సవం సందర్భంగా ఈ వాయినాలందిస్తున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో డి.చంద్రశేఖర్, సంఘం సభ్యులు మళ్ల గణేష్, సూరిశెట్టి శ్రీను, కొలపర్తి శ్రీను, ఉదయ్, అక్షయ్, రాజు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

'ఏపీ కో సేవా' అధ్యక్షునిగా ఈశ్వరరావు

అనకాపల్లిటౌన్ : ఏపీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సర్వీస్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(ఏపీ కో సేవా) అడ్‌హాక్ కమిటీ అధ్యక్షునిగా ఎస్.ఈశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎన్జీవోస్ భవనంలో ఆదివారం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. కార్యదర్శిగా సీహెచ్ రమణ, కోశాధికారిగా రామస్వామి, జిల్లా కో ఆర్డినేటర్‌గా బి.త్రినాథ్‌లు ఎన్నికయ్యారు.

ఉప్పపంట వర్షార్పణం!

- అకాల వర్షంతో మడుల్లో చేరిన నీరు
- లబోదిబో మంటున్న రైతులు



వర్షాలకు నీట మునిగిన ఉప్ప పంట పొలాలు



గట్ల మీద నిల్వ చేసిన ఉప్ప కరిగిన దృశ్యం

పరవాడ: మండలంలో శని, ఆదివారం కురిసిన అకాల వర్షాలకు ఉప్పుపంట దెబ్బతింది. పంట చేతికి రావాల్సిన సమయంలో కురిసిన వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెంలో 120 ఎకరాల్లో ఉప్పు పంట సాగుచేస్తున్నారు. గత రెండు రోజులుగా వాతావరణం చల్లగా ఉండడంతో ఉప్పు పంట చేతికి రాకపోవడమే కాకుండా శనివారం రాత్రి, ఆదివారం ఉదయం కురిసిన కుండపోత వర్షం కారణంగా పంట పొలాల గట్లపై నిల్వ చేసిన ఉప్పు వర్షం నీటికి కరిగిపోయింది. ప్లాట్ ఫారాలపై నిల్వ చేసిన ఉప్పు కుప్పలు కూడా చాలా వరకు కరిగిపోయాయని రైతులు వాపోయారు.

పంట చేతికి వచ్చిన తరుణంలో..

ఈ ఏడాది వాతావరణం కాస్తా ఆశాజనకంగా ఉండడంతో రెండు నెలల నుంచి అడపాదడపా ఉప్పు పంట చేతికి అందుతోంది. ఈ తరుణంలో ఉన్నట్టుండి వాతావరణంలో వచ్చిన మార్పుల వల్ల కురిసిన అకాల వర్షాలకు తీవ్ర నష్టం సంభవించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలు మెండుగా కాస్తే ఉప్పు పంట సీజన్ మే నెల వరకు ఆశాజనకంగా ఉంటుందని ఆశించిన నేపథ్యంలో కురిసిన వర్షం తమ పాలిట శాపంగా మారిందని ఉప్పు రైతులు వాపోతున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పరవాడ: పరవాడ-గాజువాక రోడ్డులో గొర్లివానిపాలెం సమీపంలో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ పేర్ల విజయకుమార్(36) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు. మృతుడు అచ్యుతాపురం మండలం పూడి గ్రామానికి చెందినవాడని తెలిపారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఎల్ల సోము నాయుడు, కారు డ్రైవర్ ముద్దాడ అప్పలరాజులు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వివరాలు.. శుక్రవారం రాత్రి పూడి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ విజయకుమార్ గాజువాక నుంచి అచ్యుతాపురం వస్తూ ఎదురుగా వస్తున్న కారును ఢీ కొట్టడంతో ఆటో డ్రైవర్, కారు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో నడిచివెళుతున్న సోము నాయుడు కూడా తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రులకు కేజీహెచ్‌లో వైద్య సేవలు అందిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ విజయకుమార్ మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నారు. మృతదేహానికి ఆదివారం పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించామని సీఐ ఈశ్వరరావు చెప్పారు.

కొత్త అమావాస్య ఉత్సవాలు ప్రారంభం

కశింకోట : స్థానిక నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య ఉత్సవాలు ఒక రోజు ముందుగానే ప్రారంభమయ్యాయి. ఆదివారం వారపు పొద్దు కావడంతో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలు వేగి శివగణేష్, వేగి రామరాజుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. సోమవారం నుంచి మూడు రోజులపాటు కొత్త అమావాస్య ఉత్సవాలు జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా సాయంత్రం సంప్రదాయంగా జాలర్ల సారె ఊరేగింపు, రాత్రి జాగరణ, 21న కొత్త అమావాస్య జాతర, 22న ఉగాది వేడుకలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు.

వృద్ధులకు ఉపకరణాల అందజేత



వృద్ధులకు వాకర్స్ అందజేసిన హెల్పేజ్ ఇండియా ప్రతినిధులు

పరవాడ: హెల్పేజ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని వైస్ ఎంపీపీ బి.అప్పలరాజు కొనియాడారు. హెల్పేజ్ సంస్థ ఆధ్వర్యంలో మొబైల్ యూనిట్ ద్వారా వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, కలపాక గ్రామాల్లో ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 2 చక్రాల కుర్చీలు, 12 చేతి కర్రలు, 8 వాకర్లను గొరుసువానిపాలెం, కలపాక, వెంకటపతిపాలెం, వాడచీపురుపల్లి గ్రామాలకు చెందిన వృద్ధులకు అందజేశారు. నాయుడుపాలెం మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ వృద్ధులకు సేవ చేయడం ప్రశంసనీయమన్నారు. సంస్థ ప్రతినిధి కేవీ రావు మాట్లాడుతూ తమ సేవలు అవసరమైన వృద్ధులు 14567 హెల్ప్ లైన్ నంబరును సంప్రదించాలని కోరారు.

తెలుగు క్యాలెండర్ ఆవిష్కరణ



తెలుగు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పట్టణ ఎస్ఐ సత్యనారాయణ

అనకాపల్లిటౌన్ : ప్రశాంతమైన వాతావరణంలో తెలుగు ఉగాది వేడుకలు నిర్వహించుకోవాలని పట్టణ ఎస్ఐ ఎస్.సత్యనారాయణ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు నెలలు అనుసరించుటకు వీలుగా తెలుగు తిథులతో ఆంగ్ల తేదీలను పొందుపరచి కేలండర్ తయారు చేయడాన్ని అభినందించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఈ జ్ఞాన తెలుగు కాలసూచికలో భగవద్గీత వచనాలను జోడించినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా సరళమైన భాషలో రూపొందించినట్టు పేర్కొన్నారు. ఇందులో దేవాలయ సంప్రదాయాల్లో ఆత్మజ్ఞానం, తెలుగు పండగలు, నెలల విశిష్టత, త్రైత సిద్ధాంత భగవద్గీత శ్లోకాల సారాన్ని, మానువుడు ఎదుర్కొనే ప్రతి సమస్యకూ పరిష్కార మార్గం చూపే భగవద్గీత సారాంశాన్ని పొందుపరచామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తాకాశివీధి నూకాంబిక జాతర



ఆలయం నుంచి మొదలైన గరగల ఊరేగింపు



పులివేషాలు

అనకాపల్లిటౌన్ : స్థానిక తాకాశివీధి స్వయంభూ నూకాంబిక ఆలయంలో అమ్మవారి కొత్త అమావాస్య జాతర వేడుకలు అట్టహాసంగా జరుగుతున్నాయి. శనివారం ప్రారంభమైన ఈ వేడుకల్లో భాగంగా శ్రీ సత్యసాయిబాబా సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం భజన కార్యక్రమం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం అమ్మవారి ఆలయం నుంచి గరగల ఊరేగింపు, తోడపెద్దుసేవ, కోలాటాలు, పులివేషాలు, న్యూకాంతార, లేడీస్ తీన్‌మార్, డూప్స్ బాబోయ్ డూప్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

ఈ నెల 18 నుంచి ఏప్రిల్ 20 వరకు నెల రోజులపాటు అత్యంత వేడుకగా అమ్మవారి ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఇక్కడ అమ్మవారు పుట్ట నుంచి వెలిసినట్టు చెప్తారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా భక్తులు కొలుస్తుంటారు. సోమవారం సాయంత్రం 6 నుంచి మంగళవారం ఉదయం వరకు భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం కల్పిస్తారు. 21న అమ్మవారికి అమావాస్య పూజ చేస్తారు. 22న శోభకృత్ నామ సంవత్సర ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించనున్నారు. రాత్రి 7 గంటలకు దీపాలంకరణలో దేదీప్యమానంగా అమ్మవారి దర్శనం లభించనుంది. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ తాకాశి రాజేష్ మాట్లాడుతూ ఇప్పటికే ఆలయంలో జాతరను పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. క్యూలైన్‌లు, తాగునీరు వంటి మౌలిక సాదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

హోరు గాలి.. జోరు వాన

- 38.2 మి.మీ. వర్షపాతం నమోదు
- తోట పంటలకు నష్టం-రైతుల ఆవేదన



రైల్వే అండర్‌బ్రిడ్జి కింద వర్షపు నీటిలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు



కశింకోటలోని పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డులో నిలిచిన వర్షపు నీరు

అనకాపల్లిటౌన్/అనకాపల్లి రూరల్/కశింకోట : అల్పపీడన ద్రోణితో ఆదివారం తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకు వర్షం దంచికొట్టింది. ఈదురు గాలులు, పిడుగులు పట్టణవాసులను బెంబేలెత్తించాయి. 36 గంటల వ్యవధిలో 38.2 మి.మీ. వర్షపాతం నమోదైనట్టు వాతావరణ విభాగం అధికారులు వెల్లడించారు. మరో 24 గంటలు వర్షాలు కురవనున్నట్టు వాతావరణశాఖ అధికారులు తెలియజేయడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయలు, ఉద్యాన పంటలకు నష్టం జరుగుతుందన్న ఆందోళన వారిలో నెలకొంది. మామిడి, జీడి, అరటి, మొక్కజొన్న పంటలతో పాటు టమాట, మిర్చి, వంగ, బెండ తదితర కూరగాయల పంటలకు నష్టం వాటిల్లింది. ప్రస్తుతానికి నష్టం స్వల్పమే అయినప్పటికీ వర్షం కొనసాగితే భారీగా నష్టపోతామని రైతులు చెప్తున్నారు.

వర్షం కారణంగా ఒక్కసారిగా జనజీవనం స్తంభించింది. అక్కడక్కడా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రహదారులన్నీ చెరువులను తలపించడంతో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆవఖండం భూముల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో టమాటా పంట పొలాలు నీట మునిగాయి. ఈదురు గాలులకు జీడి మామిడి పంటకు నష్టం వాటిల్లినట్టు వ్యవసాయాధికారులు తెలిపారు. అనకాపల్లి- చోడవరం రహదారిలో స్థానిక రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ట్రాఫిక్ పోలీసులు లక్ష్మీదేవిపేట రైల్వేక్రాసింగ్ మీదుగా వాహనాలను మళ్లించారు.

పట్టణం, మండలంలో లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడం, మురుగు కాల్వల్లో నీరు రహదారులపైకి ప్రవహించడంతో ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడ్డారు. నిర్వహణాలోపంతో 16వ నంబరు జాతీయ రహదారిపై అక్కడక్కడా వర్షపునీరు నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులకు అవస్థలు తప్పలేదు.

కశింకోట ప్రాంతంలో ఆదివారం వేకువ జామున భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రజలు ఇబ్బంది పడ్డారు. శనివారం నుంచి దఫదఫాలుగా చిన్న పాటి వర్షాలు కురిశాయి. ఆదివారం వేకువ జామున మాత్రం ఉరుములు, మెరుపులతో పెద్ద వర్షం కురిసింది. దీంతో స్థానిక పీహెచ్‌సీకి వెళ్లే రోడ్డు నీట మునిగింది. రాకపోకలకు ప్రజలు నానా ఇక్కట్లు పడ్డారు. మండల పరిషత్ కార్యాలయం ముందు నీరు చేరింది. రెండు రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షాలు ఉదయం 10 గంటల ప్రాంతం నుంచి తెరిపిచ్చాయి. ఎండ కాసింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఈ వర్షం చెరకు పంటకు బాగా ఉపకరిస్తుందని రైతులు చెప్తున్నారు.

క్రికెట్ అభిమానులకు ఊరట

ఆదివారం సెలవుదినం.. విశాఖలో భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య వన్డే క్రికెట్ మ్యాచ్‌తో శనివారం రాత్రి నుంచే క్రికెట్ అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపయింది. మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూసేందుకు టికెట్లు దొరకని అభిమానులు టీవీల ముందు కూర్చున్నారు. వర్షం వల్ల ఎక్కడ మ్యాచ్ జరగదోనని భయపడ్డారు. మధ్యాహ్నం వర్షం ఆగి, మ్యాచ్ ప్రారంభం కావడంతో అభిమానులు టీవీలకు అతుక్కుపోయారు.

మల్లు స్వరాజ్యం ఆశయ సాధనకు కృషి



మల్లు స్వరాజ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నేతలు

అనకాపల్లి రూరల్ : భూస్వామ్య వ్యవస్థను రూపుమాపేందుకు స్వాతంత్య్ర సమరయోధురాలు మల్లు స్వరాజ్యం రాజీలేని పోరాటం చేశారని పలువురు ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. మల్లు స్వరాజ్యం ప్రథమ వర్థంతి సందర్భంగా స్థానిక కార్మిక కర్షక నిలయంలో ఆదివారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించిన ఆమె ఎందరో పేదలకు భూములు పంచిపెట్టేందుకు కృషి చేశారని ఈ సందర్భంగా నేతలు గుర్తు చేశారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ మల్లు స్వరాజ్యం పేదల సంక్షేమం కోసం అవిరళ కృషి చేసినట్టు తెలిపారు. స్వరాజ్యం మరణించినప్పటికీ ఆమె ఆశయాల సాధనకు ప్రజా సంఘాలన్నీ కృషి చేయాల్సిన అవసరం ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు జి.కోటేశ్వరరావు, కౌలు రైతు సంఘం నాయకుడు ఎ.బాలకృష్ణ, ఉపాధ్యాయ ఉద్యమ సంఘం నాయకురాలు శ్రీలక్ష్మి, ఎస్ఎఫ్ఐ నేతలు రమణ, ఉమామహేశ్వరరావు, పెంటకోట శ్రీనివాసరావు, అప్పారావు, విద్యార్థులు, కార్మికులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర పట్టభద్రులకు కృతజ్ఞతలు

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా టీడీపీ మద్దతు అభ్యర్థి వేపాడ చిరంజీవిరావు గెలుపు ఉత్తరాంధ్ర అభివృద్ధికి దోహదపడుతుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ చిరంజీవిరావును గెలిపించిన పట్టభద్రులకు కృతజ్ఞతలు తెలిపారు.